# వినయప్రవర్తన

"ఒరేయ్! అబ్బాయ్! యిక లెగవరా."

"అబ్బ! మళ్ళీ యివాళే మొచ్చింది యీ ముసలమ్మకు; నన్ను నిద్రలేపొద్దని లక్షాతొంభై సార్లు చెప్పాను. ఏ రోజుకా రోజు కొత్తేనాయె!' అనుకుంటూ కాళ్ళ కిందవున్న దుప్పటివేళ్ళతో గట్టిగా నొక్కిపట్టి, రెండోచెంగును తలమీదుగా లాగి చెవులకిందకు నెట్టుకుని, కడుపులోకి ముడుచుకుంటున్న మోకాళ్లమధ్య ఎడంచేయివుంచుకొని, కుడిచేతో దిండును ముఖంమీదకు వత్తుకుని సీతామ్మవారిని పెళ్లి చేసుకోపోయేముందు శ్రీరామచంద్రుల వారు వంచిన శివధనస్సులా—బిర్రుగా, బరువుగా ముసుకు నిగడదన్ని; మగతగా మత్తుగా, వెచ్చగా తెరలు తెరలుగా వస్తూన్న నిద్ర అల్లల్లో తేలిపోయేందుకు ప్రయత్నించాను.

అబ్బే! వూరుకుంటేనా మరి.

"లెగవరా నాయనా! బారెడు పొద్దెక్కినా ఏం నిద్దరా? నీ నిద్ర మండిపోను!"

అమ్మమ్మ అంత గట్టిగా అనడంలో ఏదో అంతరార్థం వుందని గ్రహించాను. బహుశ నీళ్లు తెచ్చే పనిపిల్ల వచ్చివుండదేమో? అమ్మమ్మ అలాంటి అవకాశం కలిగినప్పుడల్లా నామీద విరుచుకుపడేందుకు పూర్తిగా వుపయోగించుకునేది. ఆమెగారికి అంతకన్నా మంచి అవకాశమేముంది మరి. ఇతరత్రా అయితే తేలిగ్గా దబాయించి పారేస్తానాయె. పనిపిల్ల రాని రోజు మాత్రం, '8-30 గంటలకు కొళాయి కట్టేసిం తర్వాత లేస్తే ఏంతాగుతావురా?' అనే అమ్మమ్మకు ముసుకులోనే వుండి యిచ్చే సమాధానం ఏమీ వుండదు; చివాలునలేచి కూర్చొని వడ్డి విరుచుకొని నీళ్ళ బిందెతీసుకోవడం మినహా.

అలా బిందె తీసుకొని మామేడ పదమూడు మెట్లూ ఒక్కొక్కటే దేక్కుంటూనిద్రమొహంతో బజారుకొట్లముందుగా పక్కింటి దమయంతి కొళాయి దగ్గరకెళ్తే, అక్కడ వొక చావుకాదు. అంత చికాకులోను నిద్రమత్తులోను ఆవిడ్ని చూసి అదో రకంగా నవ్వాల్సిందే. అదోరకంగా నవ్వడంఅంటే మరేం కాదులెండి! ఆవిడ అందాన్ని, పాతివ్రత్యాన్ని చూసిమెచ్చుకొని ఆనందిస్తున్నట్టుగా నవ్వాలి. ఏమిటో ఖర్మ! ఏభైయ్యో పడి చేరుకుంటున్నా, సీతాకోక చిలుకలా సింగారించుకొని టింగురంగా అంటూ రాత్రి తొమ్మిదిగంటలదాకా చైనాబజార్లో తిరిగి, పంటిగంటదాకా వాకిట్లో కాపలాకాసే ఆవిడనుచూసి ఆవిడ వయస్సులో సగంకంటే తక్కువగా వున్న నేను అదో మాదిరిగా నవ్వి ఆనందించి గుటకలు మింగాల్సిందే-వెధవ ఆ నాలుగు బిందెల నీళ్ళకోసం! లేకపోతే ఆపూటకు ఆవొక్క బిందెడుతోనే సరి; వెధవ నాలుగు బిందెలు నీళ్ళంటే అమ్మమ్మ గొంతు పుచ్చుకుంటుంది. అలా ఎప్పుడైనా వొబిందెడు నీళ్ళు, తక్కువ తెచ్చి వెళ్లానంటే సాయంకాలం కాలేజి నుంచి వచ్చేసరికి అమ్మమ్మలం కించుకుంటుంది. మధ్యాహ్నం నుంచీ నీళ్ళకు నానా అవస్థాట్లయిందని, అల్లాడిపోయానని, యింకేమేమో అయానని, సబ్బు పెట్టి వుంచిన తన ఎర్రరంగు మల్లుపంచ వుతక్కుండా అలాగే వుండిపోయిందనీ...

"నీగ్గాదంటూరా చెప్పేదీ?" కంకర్రాయిలా తగిలిన ఆ మాటకు బిర్రుగా తన్నిపట్టిన ముసుగులోంచి బిళ్ళంగోడులా లేచి కూర్చున్నాను.

"ఏంటమ్మమ్మా! అంత ముంచుకుపోయిందీ!" "ముంచుకునే వచ్చిందిరా నాయనా! మళ్ళీ ఏంకొంప మునిగిందో!" కిటికీ చువ్వలకు కర్చుకుపోయి ఎగశ్వాస దిగశ్వాసతో కిందకు చూస్తూ నుంచుంది అమ్మమ్మ.

అమ్మమ్మ వాలకంచూస్తే పనిపిల్ల రాకపోవడంకాదు; అంతకుమించి ఏదో ముంచుకొచ్చినట్టుగానే తోచింది. అయినా నా అనుమానం కొద్దీ నీళ్ళకుండల వైపోసారి చూశాను. కొన్ని టినిండా నీళ్ళున్నయ్. బిందెలేదు. కాబట్టి పనిపిల్ల వచ్చేవుంటుందనుకొని—

"అమ్మమ్మా! నీళ్లు తెచ్చేది వచ్చినట్టుందే!"

"నీళ్లా నిప్పులూను! పోలీసుల్రా పోలీసులు!" అమ్మమ్మ ముందుమాట ఎంత గట్టిగా అందో చివరమాట అంత తేలిపోయేట్టు అంది.

అసలమ్మమ్మకు పోలీసోళ్లంటే తగని భయం ఆ మాటకొస్తే ఆంధ్రదేశంలో పోలీసులంటే భయంలేం దెవరికనొచ్చు! అలాకాదు. అమ్మమ్మ భయం వేరు. అందరికీ పోలీసుల లాఠీలు, తుపాకులు చూస్తే భయం; కాని అమ్మమ్మకు ఆ ఎర్రటోపీ చూస్తేనే భయం. దానికొ కారణం వుందనుకోండి. బుల్లెపల్లి

## "వసశ్రీ"


ప్రెసిడెంట్ వనస్పతితలనూనె
ప్రెసిడెంట్ స్నో
ప్రెసిడెంట్ టాల్కం పౌడర్
సుందర నారీమణుల ఎన్నిక




తయారుచేసినది:
రతోడ్ ట్రేడింగ్ కంపెనీ,
మద్రాసు 1.


లాంటి పల్లెటూళ్ళో పుట్టి పెరిగిన అమ్మమ్మకు ఎఱ్ఱబుట్ట చూస్తేనే అంతభయం. అంటే ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు. ఈ మూడు సంవత్సరాలు ఆ ప్రాంతంలోనే వుంటే కొంతవరకు ఆభయం కాస్తా తీరిపోయేదేమో ? కాని మూడు సంవత్సరాల్నుంచీ అమ్మమ్మ మనవడికి వండిపెట్టటానికి మద్రాసులో మకాం వేసిందాయె.

అమ్మమ్మ యిప్పటికీ చెప్తూవుంటుంది. వాళ్ళ మూడో అమ్మాయి పుటకలకు - వాళ్ళవూళ్ళో వో పెద్ద కేసు నడిచిందని. అప్పట్లో వో రోజున కాకీ లుడిగీలు, మేజోళ్ళు, నల్ల బూడుసులు వేసుకుని, ఎఱ్ఱబుట్టలు పెట్టుకుని నలుగురు వాళ్ళూరు వొచ్చారట. వాళ్ళు వచ్చీ రావడంతోనే, రచ్చబండల మీద కూర్చొని చర్చలు సాగిస్తున్న మొగవాళ్ళు ఎక్కడవాళ్ళక్కడ పరారయినారట. రొమ్ములమీద గుప్పెడెత్తున కండలు పెరిగి కొమ్ములు తిరిగిన పిడుగులాంటి రామయ్య పొలంపోయి కూర్చుని అర్ధరాత్రయింతర్వాతగాని యింటికిరాలేదట. బరిమీద వొక్క దెబ్బన నాలుగు తలకాయల్ని కొబ్బరికాయల్లా పగలకొట్టిన వస్తాదు నరిశిమ్మయ్య పొరుగూరుపోయి మూడోరోజున కాని రాలేదట. మీసాలమీద నిమ్మకాయలు నిలిపిన భీమయ్య కోళ్ళగూట్లో దూరాట్ట. ఇంకెందుకులెండి! యిలా ఎవరిమట్టుకు వాళ్ళు తలోదార్నీ తప్పుకున్నారట.

అయితే ఆడంగులు మాత్రం వోరగా వేసిన తలుపు సందుల్లోంచి, కిటికీ చువ్వల్లోంచి - ఆ లుడిగీల్నీ, నల్లబూడ్సుల్నీ, ఎఱ్ఱబుట్టల్నీ చూస్తూనే వున్నారట; మగవాళ్ళు గాదెల చాటునుంచీ, భోషాణాల్లోంచి బుసలు కొట్టూంటే.


ఇంకేముంది! అలా వచ్చిన ఎఱ్ఱబుట్టలోళ్ళు సరిగ్గా అమ్మమ్మగారి యింటిముందే ఆగిపోయేసరికి అమ్మమ్మ. స్పృహతప్పి మూర్ఛపోయిందట. నిండుచెల్లాయె మరి; అయినా ఆమెగారు అప్పుడు జరిగిందంతా స్వయంగా తను చూసినట్టే చెప్తుంది. అదేంటమ్మమ్మా! మూర్ఛపోయి ఎలా చూశావంటే కోపంవచ్చి మూతిముడుచుకొని 'నీవన్నీ రాలుగాయ మాటల్లా తిప్పకాయ కాలం!' అనుకునేది. సరే, ఆ కాలం మూర్ఛలు అంతే అనుకొని చెప్పమని బతిమిలాడితే కాసేపు సాగదీయించుకుని మరీ చెప్పేది.

ఆవఝాన, అందాకా అరివేణిఖానల చాటున దాక్కున్న వాళ్ళపెద్దన్న, పుటిక్కిన బుట్టలోళ్ళు ఆడోళ్ళ నేమయినా అనిపోతారేమోనని, ఆడోళ్ళ సందర్నీ లోపలికి పొమ్మని వొకరంకెవేసి తను బయటకొచ్చి పోలీసోళ్ళ ముందుకొచ్చి నిల్చున్నాట్ట. జారిపోతున్న గిరజాల జుట్టును ముడి వేసుకుంటూ, పంచ మోకాళ్ళపైకి మడిచి దోపుకుని, చేతులు కట్టుకుని తలవంచి అతి వినయంగా సిత్తం సిత్తం అన్నాడట.



ఆ వచ్చిన పోలీసోళ్లు, పక్కవూళ్లో ఏదో ఖూనీకేసు జరిగిందనీ సాక్ష్యం వుండాలనీ అడిగితే, ఆ వూళ్ళోళ్ళగుండానే తాము సంతకు పోవాల్సి వుంటుందని వాళ్ళ మీన సాచ్చికం చెప్పి తాము మనలేమని మనివి చేసుకున్నాడట.

పోలీసులు వెళ్ళాక, వాళ్ళపెద్దన్న ధైర్య సాహసాల్ని గురించి గుంపులుపడి



వింతగా పక్క పదిపదిహేనూళ్ళ దాకా చెప్పుకున్నారట.

మరుసటిరోజు, నలుగురు పగటి వేషగాళ్ళొచ్చి ఆ క్రిందటిరోజున పోలీసు వేషాలేసుకొచ్చినందుకు డబ్బూ, బియ్యం అడుక్కుని చక్కా పోయారని అమ్మమ్మ చెప్తూంటే నాకు నవ్వూ ఏడుపూ రెండూ వచ్చేయి.

ఆతర్వాత నిజంగా పోలీసులొచ్చి నప్పుడుకూడా వాళ్ళ పెద్దన్నే ముందు నుంచున్నాట్టకూడాను. ఆమాట చెప్పక పోతే అమ్మమ్మకు కోపం రావొచ్చు!

ఇంతకీ, యింటిముందు కొచ్చి కూర్చున్న పోలీసుల సంగతి వదిలేసి అమ్మమ్మ పోలీసు అనుభవాల్ని, పోలీసులంటే ఆమెకున్న భయాన్ని, అభిప్రాయాల్ని గుర్తుచేసుకుని నెమరు వేసుకు పోతూంటే - యింట్లో యింతసేపటిదాకా దేన్నో సర్దుతున్నాననో, ఎవడినన్నా దాస్తున్నాననో లేనిపోని అనుమానం వాళ్ళకి కలిగిందంటే మొదటికే మోసం రావొచ్చు, అనుకొని కప్పుకున్న దుప్పటి విసిరేసి వూడిపోయిన లుంగీ చుట్టుకుంటూ-"ఎక్కడ! ఏమిటమ్మమ్మా?" అంటూ అమ్మమ్మ దగ్గర కెళ్లి ఆమె చూస్తున్న వైపే కిటికీలోనుంచి కిందికి చూశాను.

ఇంకేముంది! పోలీస్ వేన్!! సరిగ్గా మా వాకిలిముందే ఆగివుంది. చుట్టూ చేరివున్న జనంలో తేలిపోతూ పది పదిహేను ఎర్రటోపీలు కనపడ్తూనే వున్నయ్.

నేను భయపడాల్సిన కారణం మెదడుకు తోచకపోయినా, నా గుండెలు మాత్రం నాటంతటవే జారిపోయినై. పోలీసులకూ భయానికీ ఏదో అవినాభావ సంబంధాన్ని మనసు వూహించివుంటుంది.

"ఏంరా నాయనా! మళ్ళీ యింట్లో ఏమన్నా తెచ్చిపెట్టావా ఏమిటిరా? ఖర్మ!" గుండెలమీద చేతులు వేసుకుని దడదడలాడుతూ అమ్మమ్మ సొద మొదలు పెట్టింది.

ఆమెగారు 'మళ్ళీ' అనడంలో - వో గొప్ప విశేషం లేకపోలేదు. అప్పుడోసారి మా నాన్నగారొచ్చినప్పుడు యింట్లో వున్న ఎర్రట్ట పుస్తకాలన్నీ చించి తగలేయమని అమ్మమ్మ చెవిలో వూదిపోయారట. అంతటితో అమ్మమ్మ లంకాదహనానికి పూనుకుంది. ఓ రోజు లేచి చూసేసరికి బొగ్గులుపొయ్యి కింద మండిపోతున్నాయి. పుస్తకాల్ని అట్టలతో సహా గుంజి చించి మడిచి దోపేసింది; ఇంకా చెప్పుకుపోతూంటే మీకూ రావొచ్చు అనుమానం - అవేవో పేర్లుకూడా చెప్పటానికి వీల్లేని

వల్లమాలిన గ్రంధాలని! ఇంతకీ అవి – జీవ కారుణ్య సమితివాళ్ళు ప్రకటించిన జంతుబలి నిషేధం తాలూకు పుస్తకాలు. మా వీధిలోనే వున్న జీవకారుణ్య సంఘంవాళ్ళు వూరికే యిస్తుంటే పోనీయడ మెందుకని యిచ్చినంతవరకూ వద్దనకుండా తెచ్చుకొని దొంతర్లు పేర్చేశాను. అమ్మమ్మ వాటిమీద యెన్నాళ్ళనుంచీ కన్ను వేసి వుంచిందో?

'అదేమి టమ్మమ్మా! అలా ఆపుస్తకా లన్నీ తగలేస్తావ్? పొయ్యి వెలిగించుకోటానికి కట్టుకుపోయి నన్ని మామూలు పేపర్లుండగా' అంటే 'ఒరేయ్! యికనుంచీ యిటువంటి కమ్యూనిష్టోళ్ళ పుస్తకాలు తెచ్చి యింటో పెట్టావంటే మాట దక్కదు. మీ నాన్న మొన్నొచ్చినప్పుడదేపనిగా చెప్పి వెళ్ళార'ంది.

'మంచిపని చేశావ్! అవేం కమ్యూనిష్టు పుస్తకాలే?' నవ్వూ, కోపం రెండూ వచ్చినయ్. అందుకామె–'ఒరేయ్! నేనంత పిచ్చిముండను కాదు లేరా' అంటూ వో పుస్తకం అట్టమీద ఎర్రరంగులో వున్న బొమ్మను తెలివిగా చూపించింది.

ఆచిత్రంలో— 'అహింసా పరమో ధర్మః' అని రాసివున్న అక్షరాలకిందగా; వో గేవరగుడి, గుడిముందు బలికి సిద్ధంచేయబడి – వేపమండలు మెళ్ళో వెళ్ళాడుతూండగా, మెడపైకెత్తి అరుస్తూన్న మేక; వో కోడిపెట్ట; వాటిని చంపటానికి సినిమాలోని రాక్షసుడులా మీసాలు మెలితిరిగి వికృతాకారంతో ఒకడు కత్తి పైకెత్తిపట్టుకొని వుంటాడు. గాంధీటోపీ పెట్టుకొన్న వొకవ్యక్తి రెండుచేతులూ పైకెత్తి 'వద్దు! వద్దు!' అంటూ వుంటాడు – అదీ సంగతి.

అందులో, ఎవర్ని కమ్యూనిష్టుగా వూహించుకుందో, ఆ చిత్రాన్నంతా ఏంగా చిత్రించుకుందో, ఆ అమ్మమ్మకే తెలియాలి; లేకపోతే యెర్రట్ట పుస్తకాలు తగలేయమని ఆమెగారి కుపదేసించిన మానాన్న గారికైనా తెలియాలి.

ఇంతకీ పోలీసుల సంగతి రాగానే కమ్యూనిష్టు గొడవల్లో ఎందుకు పడ్డారో అమ్మమ్మకే కాదు నాకూఅర్థం కాదు. పోలీసులకూ భయానికీ వున్న సంబంధంలాంటిదే కమ్యూనిష్టులకూ పోలీసులకూ వుందేమో? మరి పాడుగొడవ!

అయినా, నేనేమన్నా కమ్యూనిష్టునా పోలీసులంటే భయపట్టానికి? జీవకారుణ్య సంఘంవాళ్ళ జంతుబలి నిషేధ ప్రచార గ్రంధాలు ఎంత కమ్యూనిష్టు సారస్వతమో నేనూ అంతవరకే కమ్యూనిష్టును.

మాటలధోరణిలో కొళాయినీళ్ళ దగ్గర్నుంచీ వ్యవహారాన్ని యింతవరకూ సాగదీసినన్ను చూస్తే మీలో కొంతమందికైనా యితగాడి కేదో ఆ పాతవాసన లున్నాయేమోనని అనుమానస్పదంగా వుండొచ్చు!

అందాకా వచ్చింది కాబట్టి నిజం చెప్పేస్తాను. చేసిన పాపం చెప్పితే తీరుతుందంటారు గదూ!

నాలుగైదు సంవత్సరాల నాడెప్పుడో నాకు తెలీకుండానే నాలో వో కమ్యూనిష్టు జొరబడ్డాడు. ఆ తర్వాత వాడి అతగతీ నేనంతగా పట్టించుకోలేదు. ఈ మధ్య వో సంవత్సరన్నర క్రిందట ఏదో అవసరంకొద్దీ ఆ లోపలివాడు యింకా వున్నాడేమోనని వెదికిచూశాను. అసలు నిజంగా వున్నాడో లేడో గాని నా మట్టుకు నాకు వున్నట్టుగానే అనుమానం తోచింది. లోపలి వాడిని లోపలే అణిచి, గొంతు నులిమి చంపేయాలని – పోలీసులను, జైళ్ళను, లాఠీలను, తుపాకిగుళ్ళను చూపించి బెదరించి చూశాను. దానికి ఆ లోపల వాడు లొంగిపోయినట్టు నమ్మకం తోచలేదు. నేనూ అంత తేలిగ్గా వదలే రకం కాదు కాబట్టి యింకో రకం ఆయుధాల్ని వాడి చూశాను. ఉన్న కొద్ది ఆస్తిని, కాబోయే పెళ్ళాన్ని, రాబోయే వుద్యోగాన్నీ, నావెనుక నోరు తెరుచుకు చూస్తున్న ఆత్మీయుల్ని, పైనా బజారు తిరుగుడునుంచీ – మెరీనా కాంటిన్ల దాకా కలసి మెలివేసుకుపోయిన ఐహికవాంఛల తాలూకు వేదాంతాన్ని కలిపి కరగించి, రంగరించి నూరు పోసే సరికి చప్పున లొంగిపోయాడు లోపలివాడు పిల్లిలా కిక్కురుమనకుండా.

అలాబలవర్మరణం పొందిన వాడి శవం కుళ్ళి చీకి, దాని తాలూకు కుళ్ళు కంపు వుక్కిరిబిక్కిరి అయేట్టుగా నాలోంచి కొంతకాలంపాటు కొట్టి ఆగిపోయింది. తర్వాత త్వరలోనే పదిహేడణాల పచ్చి దేశభక్తుడుగా అయానను కుంటాను.

కాని, మా అమ్మమ్మకు నాలో వచ్చిన యీ మార్పును అర్థంచేసుకు నేంత చైతన్యం లేదు. అసలమ్మమ్మకు దేశభక్తుడికి, దేశద్రోహికి అంతగా భేదం తెలీదేమో? నేను దేశానికి ఏమైనా తనకు మాత్రం మనుమడుగానే చూసుకుంటుంది అమ్మమ్మ. ఆ మాటకొస్తే అమ్మమ్మకు ఆనాడు నే చేసిన దేశద్రోహమూ కనపడలేదు. యీనాడు నే చేస్తున్న దేశసేవా కనపడలేదు. నేను ఎప్పుడు ఏం చేసినా అది నామనసు గోడలుదాటి బయటికి రాలేదు.

అమ్మమ్మ నా గురించి ఎక్కువగా సంతోషపడేది. మంచి ఆస్తిగల వో అమ్మాయిని పెళ్ళిచేసుకున్నప్పుడో, లేక హోదాగల వుద్యోగం చేస్తున్నప్పుడో; అంతకూ మించిత స్తే విసుక్కోకుండా అడగ్గానే వో రెండు బిందెలు నీళ్ళు ఎక్కువగా తెచ్చినప్పుడూను.

ఏమైనా, యింటిముందు పోలీసు లారీ వచ్చి నుంచున్నందుగ్గా యింత రాద్ధాంతం చేసుకుంటున్న నా మనస్తత్వం నాకే వింతగా తోచింది. నా భ్రమ కాకపోతే యేమిటీ యిదంతాను? ఆనాడు మా అమ్మమ్మగారూళ్ళో చేసినట్టుగా వుంది. యింకేం! సత్సంప్రదాయాలు ఎక్కడికి పోతయ్!– కోడిపందేల్లో రోషాలు పెంచుకొని మీసాలు మెలికేసుకుని దేశాన్ని రక్తపాతంలో ముంచెత్తిన ఆంధ్రజాతిలో–యీ పిరికి గుండెలు–హాతోస్మి!—

కళ్ళు కోసారి గట్టిగా నులుముకుని వంకెనున్న చొక్కాలో తలదూర్చేసరికి–

"ఒరేయ్! అబ్బాయ్! మెట్లెక్కి వస్తున్నట్టున్నార్రా!" ఆదుర్దాగా హడలిపోతూ అంది అమ్మమ్మ.

వనక అమ్మమ్మ అంటూన్నది వినిపించుకోకుండానే వొక్క వూపులో మా పదమూడు మెట్లూ దిగి కిందకు వచ్చేశాను.

పోలీసు వేన్! వాకిలి కడ్డంగా పెనుభూతంలా ఆగివుంది. ఎరుటూ పుకు కొంచెం కిందగా వున్న కంతల్లోంచి మూతులు బయటకు పెట్టి నా గుండెల్లోకి చూస్తూన్న తుపాకులు నా దృష్టిని ఆకర్షించుకొన్నాయ్. అవి అలా నా వంకేసి దీక్షగా చూస్తూంటే నా గుండెలు గతుక్కుమన్నాయ్. వాటినుంచి బలవంతంగా తప్పించుకొన్న నా కళ్లు ఎదురుగా కారుకు అంటించబడివున్న పోస్టరుపై పడినయ్.

'వినయ ప్రవర్తన వారం! – యింగ్లీషులోను, తమిళంలోను, తెలుగులోనూ రాసి వుంది. అమ్మయ్య! బతికేంరా భగవంతుడా! అని మనసుకుదుట పరచుకుని నా అకారణభయానికీ, అనుమానానికీ, పిరికితనానికి నాలో నేనే నవ్వుకున్నాను. దానికి బాధ్యతకొంతవరకూ అమ్మమ్మమీద వేసి, మనసు తేలిక చేసుకుని గుంపులో


## నారసింహ లేహ్యము




బంగారు చేర్చబడినది. మేహము, నిర్బలక, నిస్సత్తువ శుక్లనష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 12 అ.
పి. సి. ఏ. &కంపెని. "ఆయుర్వేదసమాజం"
పెరిదేపి–నెల్లూరు జిల్లా.

జొరబడ్డాను — అదేమిటో వివరంగా తెలుసుకోవాలనే కుతూహలం కొద్దీ.

అందులో - యిద్దరు పెద్ద అధికార్లులా వున్నారు - వొకాయన యింగ్లీషులో, మరొకాయన తమిళంలో వినయ ప్రవర్తన వారం యొక్క వుద్దేశ్యాల్ని, ఆశయాల్ని; ప్రజలకూ పోలీసులకు మధ్య వుండాల్సిన సంబంధాల్ని గురించీ, ప్రజల పట్ల పోలీసులు నిర్వర్తించాల్సిన బాధ్యతలు - ముఖ్యంగా పోలీసులు తమ విధి నిర్వహణంలో ప్రజలందు చూపాల్సిన వినయ ప్రవర్తనగురించీ వొక్క పూవున సుక్కదిప్పుకోకుండా వుపన్యాసం యిచ్చేస్తున్నారు. అప్పుడప్పుడు చేతిలో వున్న రాసుకొచ్చిన కాగితాలు చూసుకుంటూను. ఒక కానిస్టేబుల్ పదిమందిని పక్కవాటుగా చేర్చి, అరవ తెలుగులో అదే పాఠంసారాంశాన్ని వప్పగించేస్తున్నాడు.

అది వింటున్నంతసేపూ, పోలీసులంటే కరుకు కట్టుకుపోయిన నా అభిప్రాయాలు మంచులా కరిగిపోయినై. ఆ కొంచెంసేపు వాళ్ళు ఎంతో దగ్గరవాళ్లుగా మనవాళ్లుగా అనిపించారు.

ఈ సంగతిని — ఏదో వూహించుకొని భయపడుతున్న అమ్మమ్మ చెవులో వేద్దామని వుత్సాహంకొద్దీ జనంలోంచి దూసుకు వచ్చి మెట్లెక్కపోతూంటే — బిందె బోర్లించుకుని మెట్లపక్కగా వాకిట్లో కూర్చున్న పనిపిల్ల ఎదురైంది.

"ఏం! యింకా యిక్కడే చతికలపడ్డావ్? పంపు కట్టేసే టైమవుతూంటేను!" అంటుకది యింతపొడుగున మూతి సాగదీసుకుంటూ —

"నా ఎప్పిడీ పోరదూ? పోలీసుకారక్ వయిలో అడ్డెందా వుంటిరి! నా యెన్నా సెయర్దు?" అంది.

ఓసి దీన్ని తగలెయ్యా! ఎలాగో సందు చేసుకుని తేకూడదూ? తుమ్మితే వూడిపోయే ముక్కాయే; గట్టిగా ఏమైనా అంటే అది కాస్తా బిందె అక్కడ పారేసి పోతే — ఆ తర్వాత పడాల్సిన అవస్థ పూర్తిగా తెలుసు కాబట్టి — చేసేదిలేక వెనక్కు తిరిగి ఆ తెలుగులో మాట్లాడుతున్న కానిస్టేబుల్ దగ్గర కొచ్చాను.

చెప్పాలా వద్దా అని వెనక్కూ ముందుకూ సాగుతూ రబ్బరు బంతిలా మనసులో కొట్టుకుంటున్న దాన్ని ధైర్యం చేసి అనేశాను.

"సార్! కొంచెం కారు పక్కకు తీయించండి; నీళ్ళు తెచ్చుకోటానికి ఇబ్బందిగా వుంది." వినయంగానే అన్నాను.

"అక్కడ దొరగారిదగ్గర చెప్పుకోండి" అంటూ నా చేయి పుచ్చుకుని అతగాడు కార్లో కూర్చున్న దొరగారి వద్దకు తీసుకెళ్ళాడు.

సంగతి విని ఆయన "సారీ! సారీ! క్షమించండి. యిప్పుడే వెళ్ళిపోతున్నాం" అన్నాడు.

ఆసమయంలో నాకు వాళ్ళ నేదోఅగ్నిపరీక్ష చేశా ననిపించింది. నాకేమిటి వాళ్ళకూడా అలానే తోచివుండొచ్చు!

నాకృతజ్ఞతను, సుహృద్భావాన్ని తెలియజేసుకుంటుండగానే కారు అక్కడ్నుంచి శరవేగంతో తారోడ్డునుకక్కివేసుకుంటూ పోయింది.

"అమ్మమ్మోయ్! చూశావటే?" వొక్క గంతేశాను అమ్మమ్మ దగ్గరకు.

"నాగుండెల్లో గుండెలు లేవురా నాయనా! నిన్నట్లా ఆపోలీసునచ్చినోడు కారుదగ్గరకు తీసుకుపోతూంటేను." అమ్మమ్మ దడదడలాడుతూ అంది.

"ఓస్! అదికాదే! మనం నీళ్లు తెచ్చుకోటానికి యిబ్బందిగా వుంది కారు అక్కడనుంచి తీయమనగానే తీసేశారే!" ఎంత గర్వంగా అన్నానో అమ్మమ్మకేం అర్థమౌతుంది.

"ఓరి పిడుగా! ఎన్ని గుండెత్తో అడిగావురా వాళ్ల నామాట?" దంతాలులేని దవడను నొక్కుంది.

"అబ్బ కాదు లేవే! ఇది పోలీసుల వినయప్రవర్తన వారమే!"

"ఇనయ పెవర్తనేంటిరా?"

అది అమ్మమ్మకు పలికి చావదు. చెప్తే తెలిసీ చావదు. ఎలాఆ మెతో చచ్చేది? నీకు తెలినుదులేవేఅంటే కస్సుమంటుందాయె.

"ఇదివరకటిలా కాదే పోలీసు వోళ్లలో మార్పు వచ్చింది."

"అట్లా చెప్పరా మరి! నీవు చెప్తేనే వెళ్లిపోయారంటావేం?" ముసలమ్మ తెలివిగానే అంది.

"ఏడ్చినట్టే వుంది. ఎట్లా అయినా వొకటేలేవే!" విసుకుబుట్టి విసురుగా అనే సరికి అమ్మమ్మ సంభాషణ మారుస్తూ-

"కాలోజీలేదురా యివ్వాళ?" అంది.

"ఎందుకులేదే?" అంటూ బాత్ రూంలో జొరబడ్డాను. [ఇంకా వుంది]


## బిడ్డల అజీర్ణమా?

GRIPELIX తృటిలో వారికడుపునొప్పి, వాంతి, భేదులు, ఉబ్బరము, జ్వరము, దగ్గు, ఈడ్పులు మొదలగువాని నెల్ల హరించి, వారికి హాయి, మీకు ఆనందము కూర్చును. ఏమరకండి. ఈదివ్యామృతము, బిడ్డల ఆరోగ్యము కాపాడుచు, బలవంతుల గావించుటలో శ్రేష్ఠమైనది.



గ్రైపెలిక్స్

Mfrs: Synthetic Medical Products.
Madras 10.— Ongole
Stookists : Standard Drug & Chemicals
131, Nainiappa Naik St., Madras

## గెలవండి! రూ. 5,000

బహుమతులు
1, 2 క్రాసువర్డ్సు ఇప్పుడే తెలుగులో బయలుదేరినవి.
ఎంట్రీ కూపనులు ఉచితముగా పంపబడును. ఎంట్రీ కూపనులు సేకరించి పంపు కలెక్టర్లు ప్రతి వూరియందు కావలయును, నేడే వ్రాయండి:
మురళీ క్రాసువర్డ్సు
(గవర్నమెంటు రిజిష్టర్ నెం. 1894)
పలమనేరు. — చిత్తూరుజిల్లా.

## వినపాముల శీతారామయ్యా అండ్ కో.,

పార్కురోడ్డు :: విజయవాడ.

బ్రాంచీలు : ఒంగోలు - చీరాల - బాపట్ల - పొన్నూరు - తెనాలి - గుంటూరు - నర్సారావుపేట - మార్కాపురం - యేలూరు - రాజమండ్రి.

## మాసీ - హారీసు

పాడిపంటలు అభివృద్ధికి నిరాఘాటముగా పనిచేయుటకు
నమ్మదగిన ట్రాక్టర్లు:
శేల్సు - సర్వీసు గ్యారంటీ.
Distributors of : RALLIS INDIA LTD.,
*For :*
**Krishna, Guntur, East & West Godavary Dist.**

# వినయప్రవర్తన

[గత సంచిక తరువాయి]

"వెధవ గ్లాక్సోటిన్! ఒక్క టిఫవాయి కూడా బయటపెట్టడే! ఏం వందలు కావాలన్నానా? వేలు కావాలన్నానా? ఒక్కటంటే ఒక్కటీ! ఉదయం ఏడుగంటల్నుంచీ సాయంత్రం ఐదున్నర గంటల దాకా కాలికి బలపం కట్టుకుని తిరిగినా ఒక్కటి సంపాదించలేక పోతిని. అందులోనూ బ్లాక్‌మార్కెటీర్లను స్వయంగా ప్రధానమంత్రే పురిటీయించేస్తున్న యీ దేశంలో అనుకుంటూ—మా వాకిలిముందు ఆ సంఘటన జరిగిన రెండోరోజో, మూడోరోజో—సరిగ్గా గుర్తులేదు—గ్లాక్సోటిన్ సాధించే ప్రయత్నంలో చైనాబజారు నుంచి గోడౌన్ స్ట్రీటు మలుపు తిరిగాను; ఓ రెండురూపాయలు మనవి కాదనుకుని అవతల పారేస్తే ఎవడో ఒకడు యివ్వక పోతాడా అనే ఆశతోద్దీ.

సరిగ్గా మలుపు తిరిగానో లేదో ఓ కానిస్టేబుల్ ఎదురైయాడు. ఆఁ ఆఁ ఆ కానిస్టేబులే! అతనే! నా కుడిచేయి నాకు తెలీకుండానే కణతలదాకా వచ్చి అతనికి సలాంకొట్టేసింది. అతను చిరునవ్వుతో అదోమాదిరిగా చేయెత్తి దించేసి "ఎక్కడికి సార్! పోతారు?" అన్నాడు.

ఇంకేం! అంతకంటే కావాల్సిందేముంది? పొద్దుట్నుంచీ గ్లాక్సోటిన్ కోసం ఎంత అవస్థపడుతూంది ఆప్యాయంగా చెప్పాను.

"అయ్యోపాపం! మాటమాత్రం నాతో అన్నారు కాదేం? దొంగముండా కొడుకులు! వీళ్ళందరి దగ్గరా వుంటయ్."

"ఆఁ ఆఁ అదేనండి! మేము పోతే బయటపెట్టరు."

"రండి పోదాం! ఎలా యివ్వరో చూస్తాను." లాఠీని అదోమాదిరిగా విన్యాసంచేసి ముందుకు నడిచాడు.

ఎంత హుందాతనం? ఎంత ఠీవి ఆ నడకలో.

దగ్గర్లోవున్న ఓ షాపులోకి వెళ్లడమేమి "ఏయ్! అవతారం గ్లాక్సోటిన్ కావాలనడమేమి, అయ్యా అంతకంటేనా చిత్తం చిత్తం' అంటూ టిన్ ముందున్న టేబుల్ మీదకు దూకడమేమి అంతా నా కళ్ల ముందు సినిమా షాట్‌లా జరిగిపోయింది.

టిన్ నా చేతులో పెట్టూ "ఒకటి చాలా?" అన్నట్టు చూశాడు. పోలీసాయన.

"ఓ చాలండి! థాంక్సు! వుత్సాహంతో వుబ్బి తబ్బిబ్బవుతున్న హృదయం నిండి సంతృప్తిగా అన్నాను. కృతజ్ఞతతో మునకలు వేస్తున్న నా హృదయం యేం చేయటానికి తోచక తికమక పడింది.

"కాఫీ తీసుకుందాం రండి!" హోటలకు దారితీస్తూ అన్నాను. అప్పటికి అంతకంటె మరేం తోచలేదు.

# "పసశ్రీ"

"వద్దుసార్! ఇప్పుడే తాగాను!" ఎంత మర్యాదగా నిరాకరించాడు! ఇంకా ఏదో గుణుస్తూన్న నా అవస్థ గమనించి యిలా అన్నాడు.

"అదంతా మాడూటీ సార్, మేము ప్రజలకు సేవచేయటానికిదా వుంటిమి; మీ కేమైనా అవసరమొస్తే నాకు కనిపించండి." అన్నాడు.

తర్వాత మాటల మధ్యలో అతనిపేరు మారయ్య అని, ఎప్పుడు యెక్కడ డ్యూటీలో వుండేది తెలుసుకొని, నా అభివందనాలు చెప్పి గ్లాక్సో టిన్‌తో సగర్వంగా సరాసరి అమ్మమ్మదగ్గర కెళ్లాను. ఆ వార్త అమ్మమ్మ చెవిని వేసిందాకా నాకు వూపిరాడలేదు.

ఆ నాటి సంఘటన - పోలీసు మారయ్య ప్రవర్తన నాకళ్ళు తెరిచింది. ముఖ్యంగా సరదాగా కాఫీకి రమ్మన్నారా నిరాకరించిన అతని ప్రవర్తన పోలీసు చరిత్రలో సువర్ణాక్షరాల్తో లిఖించాల్సింది.

ఏదైనా అంతలోనే వుందిగదూ? అసలు మనం ఎదటివాళ్ళను అర్థం చేసుకోటంలోనే వుంది. అంతవరకూ పోలీసుల్లో క్రౌర్యం, నైచ్యం, అవినీతి, అవిశ్వాసం, అసహ్యం, ద్వేషం, భయాన్ని పరిధులు తెలియని పరిమాణంలో చూడగలిగిన హృదయం యీ అనుభవంతో ఆ పోలీసుల్లోనే సహృదయతను, సహకారేచ్ఛను, బాధ్యతాయుతమైన మంచితనాన్ని హిమాలయపర్వతాల పరిమాణంలో పసిఫిక్ మహాసముద్రమంత లోతుగా చూడగలిగింది.

అబ్బ! దేశంలోని పోలీసులంతా మారయ్యలే అయితే! అహింస తిని, సత్యాన్ని తాగి, సంస్కృతిని పీల్చి బతికి ఆత్మసౌందర్యాన్ని ఆరాధించే యీ కర్మభూమిలో—బుద్ధభగవానుడు, గాంధీజీ అవతారాలు చాలించిన యీ పుణ్యభూమిలో, జీవనదులు పొంగిపొరలే యీ జీవగడ్డలో - పోలీసులంతా మారయ్యలుగా ఎందుకొక్కరు? తప్పకుండా అవుతారు. అయి తీరాల్సిందే. ఆలోచిస్తున్న కొద్దీ, ఆవేగంతో, ఆవేశంతో, వుద్వేగంతో హృదయం ఆనందపు వెల్లువలో మునకలు వేసింది. భూమిపైన ఓ పదిగజాలు లేచి గాల్లో నుంచున్నట్టుగా వుంది.

ఈపాటికి పోలీసుల్లో చాలామంది మారయ్యలా మారి వుంటారు. ఇంతవరకూ పోలీసులు అలా ప్రవర్తించటానికీ, ప్రజలకు పోలీసులంటే వున్న విముఖత్వానికి, విద్వేషానికి, భయానికి కారణం బ్రిటిష్ ప్రభుత్వ పరిపాలనే కావొచ్చు.

అసలు ప్రజలకు పోలీసులపట్ల అలాంటి విపరీత మనస్తత్వం ఏర్పట్టానికి కారణం పరాయి ప్రభుత్వ పాలనే కాకుండా కొంతవరకూ ఆ రోజుల్లోని కాంగ్రెసు వుద్యమం కూడా నేమో!

ఏమైనా అనతికాలంలోనే కాంగ్రెసు ప్రభుత్వ హయాంలో పోలీసులంతా మారయ్యలవుతారని, రామరాజ్యంలో శాంతిభద్రతలు తాటిచెట్టు వేళ్ళలా పాతుకుని, సత్యాహింసలు మర్రి వూడల్లా అలుముకుంటాయని నాలో సంపూర్ణ విశ్వాసం కలిగి...

"ఒరే అబ్బాయ్! యీ టిమ్ము చూడరా?" ఆశయ సౌధాల్లో కూర్చుని


## కుష్ఠు ★ బొల్లి

వగైరా మేహమచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు, గ్యారంటి చికిత్స, క్యాటలాగు ఉచితం. జి. వి. రెడ్డి అండ్ కో., (రిజిష్టర్డు) "భాస్కరాశ్రమము" గోపాలపురం, తూ. గోదావరి.

మారయ్య ఆత్మౌన్నత్యం తాలూకు విశాలత్వాన్ని కొలుచుకుంటున్న నన్ను అమ్మమ్మ కేక వంటింట్లోకి పరుగెత్తేట్టు చేసింది.

‘ఈ టిన్ను చూడరా?’ అన్న అమ్మమ్మ కేక నా లోపల దేన్నో తొలిచివేసింది. ‘ఆ టిన్ను ఖాళీది కాదు కదా? అందులో మట్టి లేదుకదా!’

ఛీ! వరి అనుమానం బ్రతుకు! అందుకే యీ దేశం యిట్టేడుస్తోంది! మనుష్యులపై విశ్వాసం వుంచకపోతే దేనిపై వుంచుతామో అర్థంకాదు. అమ్మమ్మ టిన్ విప్పకో లేక పిలిస్తే యింత అనుమానమూ వచ్చిపడిందాయె. బంగారంలా వుంటేను గ్లాక్సో పౌడరు. మళ్ళీ మారయ్య నా మనసులో కదిలాడు ‘మారయ్యలాంటి వాళ్ళు దేశానికి పదిమంది వుంటే.’

“మళ్ళీపోయి కూర్చుంటావేరా? కాలేజీకి వెళ్ళవ్?”

“పెట్టు మరీ—అన్నం!”

* * *

“ఒరేయ్! జాగ్రత్త! భద్రంగా తీసుకెళ్ళాలిసుమా!”

“వూఁ”

“ఎవరైనా పట్టుకుంటే నా పేరు మాత్రం చెప్పక నాకు తెలియదనేసేయ్.”

మినర్వాథియేటర్లో రెండోఆట సినిమా చూసి వస్తూంటే సరిగ్గా అవతారం కొట్టు ముందుకొచ్చేసరికి వినిపించింది.

నాకు తెలీకుండానే నా శరీరం గోడ పక్కకు నక్కికి నీడలో పంది కొక్కులా పాక్కుంటూ పోయింది. చూస్తునగదా! యింకేముంది! ఎక్కుం చేస్తున్నాడు తానుకు తాన్లు బిన్నీగుడ్డలు, పెట్టెలకు పెట్టెలు గ్లాక్సో టిన్నులు, గ్రైప్ వాటర్ బాటిల్సూను! ఇంకెవరూ? అవతారంగాడే! నిన్న నేకదూ వాడిషాపులో బిన్నీ గుడ్డ యిస్తున్నారని తెలిసిపోతే అయిపోయింది వచ్చే కోటాకు రమ్మన్నాడు.

వెంటనే నాకళ్ళల్లో మెదిలాడు పోలీసు మారయ్య, ‘ఇక చచ్చాడులే అవతారంగాడు. యీ దెబ్బతో వురిశిక్ష; తప్పితే యావజ్జీవ కారాగార శిక్షో, ద్వీపాంతరమో! అది తప్పినా, ఎంత లేదన్నా ఆరుసంవత్సరాలపాటు శ్రీకృష్ణ జన్మస్థానంలో దేవతా వులుసు, వేరు సెనగపప్పూ తప్పవు.’ మెదడు అవతారానికి పట్టబోయే దుర్గతిని ఆలోచిస్తూంటే కాళ్ళు పిక్కబలం కొద్దీ పోలీస్టేషన్ వైపు పరుగెత్తాయి. అంతకుముందే మనసు పోయి మారయ్యదగ్గర వాలిపోయింది.

‘ఇంతకీ పోతే మారయ్య డ్యూటీలో వుంటాడో వుండడో?’ అనుమానాన్ని సంకుచితను మనసు కదిలించుకొని పెద్దది చేసుకుంటుంటే వివేకం, విశాలత్వం తాలూకూ ఏదో భావన ‘పోలీసులంతా యీ పాటికి మారయ్యలే అయివుంటారని’ విశ్వాసాన్ని కలిగించింది.

ఆ కూర్చుంది మారయ్యేనా? ఆఁ ఆఁ అనుమానం ఎందుకు? మారయ్యే! మా మారయ్యే!! ఎగిరి గంతేసి మారయ్యదగ్గర వాలిపోయాను.

రొప్పుకుంటూ రోచుకుంటూ అలా అర్థరాత్రి వచ్చిన నన్ను చూసి మారయ్య కలవర పడ్డాడు.

“తొందరగా రావాలి! బ్లాక్ మార్కెట్! తానుకు తాన్లు! టిన్నులకు టిన్నులు! రిక్షా నిండా...వూఁ లేవండీ!”

ఎలా వున్నవాడు అలానే బయలుదేరాడు మారయ్య. లోపలికిపోయి రెండో పోలీసు చెవినైనా వేయకుండా టోపీనైనా తీసుకోకుండా అలా బయల్దేరిన మారయ్యను చూస్తూంటే—‘శిరికిం జెప్పడు శంఖ చక్రయుగముఁ జేదోయి బంధింప..’ వీధిబళ్లో చదువుకొన్న పద్యం గుర్తొచ్చింది. మహావిష్ణువు అదృష్టవంతుడు - అలా పోతన చేత పొగిడించుకొన్నందుకు. మారయ్య పోతన కాలంలో పుట్టకపోవడం ఏ విధంగా చూస్తే మారయ్య దురదృష్టమే అనాల్సొస్తుంది. మారయ్యను గురించి పోతనలా నాకు వర్ణించిచెప్పడం చేతకాకపోయినా—బ్లాక్ మార్కెటీర్ల కబంధ హస్తాల్నుంచి, విషపుకోరల్నుంచీ ప్రజలను రక్షించాలనే ఆ కాంక్ష, ఆవేదన, కార్యదీక్షను మారయ్యలో—నా హృదయం చూడగలిగింది.

అయితే యింకో సంగతి. శ్రీ మహావిష్ణువు దద్దమ్మలా—ఎప్పుడూ చేతిలో వుండే గదనుకూడా వదిలేసి పోయాడు. కాని మారయ్య చేతిలో లాఠీ వుండనే వుంది. ఎక్కడికన్నా వెళ్ళడం జరిగితే ముందు లాఠీ—తర్వాతే మారయ్య. అసలు మారయ్య లేకపోతే లాఠీ లేదు! లాఠీ లేకపోతే మారయ్య లేడు!

ముందు నేనూ, నా వెనక మారయ్యా — నేను ప్రజలకు ప్రతిరూపాన్నయితే మారయ్య ప్రభుత్వానికీ—చెట్టపట్టాలు పట్టుకుని నడిచాం. బ్లాక్ మార్కెట్ అవతారం యీ దెబ్బతో అవతారం చాలించాల్సిందే. మా యీ నవశక్తిని ఎదిరించి ఏదీ నిలువరించలేదు. మనసు ఎంతగా వూహించుకుని ఆనందించిందో, ఎంత వుత్సాహాన్ని, వుద్రేకాన్ని పొందిందో మారయ్య ముందు నడుస్తున్న నా మనసుకు తెలియాలిగాని తాపీగా కూర్చొని కాలక్షేపంకోసం కథలు చదువుకునే మీకెలా తెలుస్తుంది?

అలా మేము వెళ్ళి వెళ్ళడంతోనే కదలబోతూన్న రిక్షా ఆగిపోయింది. అవతారం మమ్మల్ని అంతదూరంలోనే చూసి అచేతనుడయ్యాడు. కాని మేము దగ్గరకు వెళ్ళడంతోనే అవతారం పోయినప్రాణాలు తెచ్చుకుంటూ—

“నువ్వేనా మారయ్యా! ఎవరో అనుకొని గుండె ఆగిపోయినంత పనైంది.” అని మెల్లిగా అన్నాడు.

“హుఁ వీడికింకా మారయ్య సంగతి తెలియదల్లే వుంది. మారయ్యంటే ఏమనుకుంటున్నాడో?” అని మనసులో అనుకున్నాను.

అవతారమూ, మారయ్యా వొకర్నొకరు చూసుకొని ఆ గుడ్డివెలుగులో అదో మాదిరిగా నవ్వుకున్నారు.



"ఏం ? మారయ్యా ! పనిమీద వచ్చి నట్టున్నావ్ ?" అవతారం అంటూన్నది వినిపించుకోకుండా నే మారయ్యా నా వైపు తిరిగి—

"ఏయ్! ఎక్కడికో చెప్పా పెట్ట కుండా నే తీసుకొచ్చావ్ ?" కోర్టు ఇంజన్ ధ్వనిలాగుంది మారయ్య మాట్లాడింది.

"అవునండీ! అవేం! అవే! దొంగబజారుకు పోతూంది సరకు—ఆ రిక్షాలో..."

"శాట్! అదంతా నిన్ను ఎవ్వురా చెప్పమన్నారు. అవక్కడికిపోతే నీ కేంరా ?" మధ్యలో అందుకున్నాడు అవతారం గాడు. వోరి వీడి జబర్దస్తీమండ! రా-గీ- అంటున్నాడు.

"అర రాత్రి నన్ను నానా అవస్థ పెట్టి, అటు తిప్పి యిటు తిప్పి మన అవతారంగారి దగ్గరకే తీసుకొచ్చావేమోయ్ ? యిలాంటి పిచ్చిపను లెప్పుడూ చేయకు."

"ఎరిగైతే నే మండీ! అవి బ్లాక్ మార్కెట్ లోకే పోతూన్నాయండీ సార్ !"

"చప్! ఏయ్! అధికంగా వాగకు. అవి ఎక్కడికిపోతే నీకేమోయ్! అయినా యింత రాత్రి పూట బజార్లో ఎందుకురా తిరుగుతావ్ ?" మారయ్యా ఎడం చేతులో వున్న లాటీ కుడిచేతిలోకి వచ్చింది.

"అది కాదండీ! మీరే ఆ రోజున చెప్పేరు కాదటండీ!" సగం చచ్చి అన్నాను.

"ఏ రోజోయ్ ?"

"గ్లాక్సో టిన్ కూడా యిప్పించారు కాదండీ!" మారయ్యకేదో గుర్తుచేయాలనే ప్రయత్నం కొద్దీ అనేశాను—

"వినయ ప్రవర్తన వారంలో - వొక రోజునండీ."

"ఓహ్! అదా! వినయ ప్రవర్తన వారం వెళ్లిపోయి మూడు నెల్లయితే యిప్పుడేమిటోయ్ నీ ఏడుపూ-" మారయ్య మాటలు నా చెవుల్లో నలికలు పాముల్లా జొరబడ్డాయ్.

నా శరీరం శీతలం కమ్మింది. అంతట్లోను ముచ్చెమటలు పోశాయ్. నా లోపలఏదో వూడిపోయి సుడిగుండంలా గిరగిరా తిరుగుతూ, బయటకు రావటానికి విశ్వ ప్రయత్నంచేస్తు న్నట్టనిపించింది. నరాలు విచ్చి పోతున్నాయ్.

"బ్లాక్ మార్కెట్! బ్లాక్ మార్కెట్" అంత భయంలో నూ బాధలోనూ పిచ్చెక్కినట్టుగా అరిచాను.

"ఇంకా చూస్తావేం మారయ్యా! వీడు అల్లరిచేసి నలుగుర్ని చేర్చి గొడవచేసేట్టున్నాడు!" అవతారం మాట పూర్తికాకముందే-"ఛ్చ! చుప్! నోరుమూయ్ !" అంటూ మారయ్య చేతిలోని లాఠీ అటూ యిటూ వోసారి వూగి, గాల్లోకి లేచి గుండ్రంగా రెండు చుట్లు తిరిగి తిన్నగా వడుపుగా వచ్చేసింది—సూటిగా నా కుడికాలు మోకాలుపైకి.

"ఫట్! ఫట్!"

"అమ్మో! నా మోకాలు!!" అన్న నా గావుకేకను లాకాలేజీ భవనం, హైకోర్టులైట్ స్థంభం ప్రతిధ్వనించాయ్.

తొలిగిపోయిన మోకాలును యీడ్చుకుంటూ వొంటికాలి కుంటిపరుగు లంకించుకున్నాను—

"మారయ్యా! అసలు వాళ్ళకు అల్సు యిచ్చినందుకు ముందు బుద్ధి తక్కువ మీది."

"నిజమే."

"అసలు వినయప్రవర్తనంటే—పోలీసులకు ప్రజలు వినయంగా వుండాలా? ప్రజలకు పోలీసులే వినయంగా వుండాలా?"




"నా అనుమానమూ అదే అవతారం!"

"అదేనోయ్ మారయ్యా! పోనీ, ఒక వారం మీరు వాళ్ళతో వినయంగావున్నారనుకో. మిగతా ఏభైయొక్క వారమూ—మూడొందల నలభైయెనిమిది రోజులూ, వాళ్ళు మీతో వినయంగా వుండొద్దూ!"

"నే నసేదీ అదే అవతారం."

"చూడు! మారయ్యా! ఆ వొక్క వారం కూడా..."

"అదే నవతారం! ఆ వొక్క వారంలో కూడా-ప్రజలు పోలీసులపట్ల వినయంగా ప్రవర్తించటం నేర్పితేబాగుంటుందికదూ! "

"మా బాగా చెప్పావ్! అంతే! అంతే హాహ్హహ"

"హా! హ్హా!"

"ఇదిగో మారయ్యా! రిక్షా పెద్దబజారు దాటిందాకా కొంచెం నీవు వెంటవుండు."

"వూఁ పోనియ్‌రా"

—అంతవరకూ దూరంగా సన్నగా మోకాలిబాధలో వినిపిస్తూన్న వాళ్ళ సంభాషణ నాకు ఆ మలుపు తిరిగాక వినిపించలేదు.

'ఇంకా నయం! మారయ్య అంతవరకూ మంచివాడే—ఆ కొట్టిన రెండు దెబ్బలూ వొక మోకాలుమీదే కొట్టేడు. ఆ విసిరిన రెండూ రెండు మోకాళ్ళమీద విసిరితే యింకేమన్నా వుండేదేనా? అసలు యింటికెలా చేరేవాడ్ని ? ఆ పదమూడు మెట్లూ ఎలా ఎక్కేవాడిని.' యీ చిన్ని చిలిపి వూహకు మెదడు నవ్వుకుంటుంటే—అంతరాత్మ ఘోషించింది.

* * * *

"ఒరే అబ్బాయ్! యిక లెగవరా!"

"అబ్బా! ఏం టమ్మమ్మా?" మళ్ళీ ఏమొచ్చింది యీ ముసలమ్మకు యివ్వాళ అనుకుంటూ బాధగా నీరసంగా లేచి కూర్చున్నాను. ఖాళీ కుండల్ను చూపిస్తూ బిందె ఎదురుగా పెట్టి—"పనిపిల్ల—వాళ్ళయ్యను పోలీసోళ్ళు ఎందుకో లాక్కుపోయారని విని బిందె అక్కడ పారేసి పోయిందిరా!" అంది అమ్మమ్మ.

భారంగా వొళ్ళు విరుచుకుని లేచి నుంచోపోయేసరికి మోకాలు కలుక్కుమంది.

"అంజేంట్రా నాయనా! మోకాలంత లావున వాచింది!"

"వినయ ప్రవర్తన పరివర్తనే !"

అమ్మమ్మకు అర్థంకాలేదు. తాటికాయంత లావున వాచి వుబ్బిన నా మోకాలు నీళ్లబిందెకేసి జాలిగా మాశింది. అవ్యక్తమయిన మూగ బాధలో మునిగిపోయింది హృదయం. (అయిపోయింది)★